సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



మట్టి గణపతినే పూజిద్దాం
పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ప్రజలు మట్టి గణపతినే పూజించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు.

8లో



టమాట కిలో రూ.8.50
కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.8.50, కనిష్టం రూ.3.50 చొప్పున విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.3°/21.6°

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

ఇన్‌చార్జ్ జేసీగా కార్తీక్



బాధ్యతలు స్వీకరిస్తున్న కార్తీక్

పుట్టపర్తి అర్బన్: స్థానిక కలెక్టరేట్‌లో శనివారం జిల్లా ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్(జేసీ)గా పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ బాధ్యతలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ చేతన్ వ్యక్తిగత కారణాలతో అక్టోబర్ 23 వరకూ సెలవుపై వెళ్లారు. ఆయన తిరిగి వచ్చే వరకూ ఇన్‌చార్జ్‌గా కార్తీక్ విధులు నిర్వర్తించనున్నారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

- స్పెషల్ బ్రాంచి పోలీసులకు ఎస్పీ మాధవరెడ్డి ఆదేశం



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: పోలీస్ శాఖలో స్పెషల్ బ్రాంచి ఎంతో కీలకమైందని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. నిరంతరం అప్రమత్తంగా ఉండి విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో స్పెషల్ బ్రాంచి సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పసిగట్టి సమాచారం చేరవేయాలన్నారు. చట్టాన్ని అతిక్రమించి సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజల్లో పోలీసు శాఖపై నమ్మకం పెంచేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఈవ్‌టీజింగ్ చేసే వారు, రౌడీ మూకలపై కన్నేసి ఉంచాలన్నారు. లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని సమాచారాన్ని ఇతరులకు చేరవేసినా, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి సీఐ రవీంద్రనాథ్ రెడ్డి ఉన్నారు.

11 మండలాల్లో వర్షం



పుట్టపర్తిలో కురుస్తున్న వర్షం

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని 11 మండలాల్లో శనివారం వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నల్లచెరువు మండలంలో 7.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కనగానపల్లి మండలంలో 6.2 మి.మీ, ఎన్‌పీ కుంట, గాండ్లపెంటలో 5.6, బత్తలపల్లి- 5.2, కదిరి- 5, తాడిమర్రి-3.2 పుట్టపర్తి- 2.8, నల్లమాడ 1.8, ధర్మవరం- 1.6, బుక్కపట్నం-1.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వివరించారు. మరో రెండు రోజులు వర్షసూచన ఉందన్నారు.

చీనీ టన్ను రూ. 22 వేలు



అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు ప్రకారం అమ్మకాలు జరిగినట్లు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు 143 టన్నులు అమ్మకానికి వచ్చాయన్నారు. వాటిని ఈ–నామ్ పద్ధతిలో వేలం వేయగా... టన్ను గరిష్టం రూ.22 వేలు, కనిష్టం రూ.9 వేలు, సరాసరి రూ.14 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు తెలిపారు.

వెర్రివాళ్లం కాదు బాబూ

'తమ్ముళ్ల' చూపు.. వైఎస్సార్ సీపీ వైపు!

- తీవ్ర నైరాశ్యంలో 'ధర్మవరం' టీడీపీ నాయకులు
- వచ్చే ఎన్నికల్లో టికెట్ ఎవరికిస్తారో తేలక అయోమయం
- సూరి ఒక వైపు, శ్రీరాం మరోవైపు తమదే అంటూ ప్రచారం
- పవన్‌కల్యాణ్ పొత్తు ప్రకటనతో మరింత గందరగోళం
- ఎవరి వెంట నడిస్తే భవిష్యత్తులో ఏం కష్టమొస్తుందోనని ఆందోళన
- చంద్రబాబు అరెస్ట్ విషయంలో అందుకే స్పందన కరువు
- ప్రజాబలం ఉన్న వైఎస్సార్‌సీపీలో చేరికకు సన్నద్ధం

ఓడిపోయాక పట్టుమని పది రోజులు కూడా లేకుండానే పార్టీ మారి నమ్ముకున్న కేడర్‌ను నట్టేట ముంచారు ఒకరు. పెత్తందారీతనానికి కేరాఫ్‌గా మారి కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలను చిన్నచూపు చూసే వారు మరొకరు. ఇద్దరిలో టికెట్ ఎవరికిస్తారో తెలియక, ఎవరికి జై కొట్టాలో స్పష్టత లేక అయోమయం నెలకొన్న సమయంలోనే.. పానకంలో పుడకలా జతకలసి తామూ మీ వైపే అని ప్రకటించిన వారు మరొకరు. ఈ మూడు ముక్కలాట అర్థం కాని టీడీపీ నాయకులు, కార్యకర్తలు మాత్రం మళ్లీ మోసపోవడానికి సిద్ధంగా లేమంటూ తమ దారి తాము చూసుకుంటున్నారు.



ధర్మవరం: నియోజకవర్గంలో టీడీపీ దిక్కులేనిదిగా మారింది. అధిష్టాన వైఖరిని తెలుగు తమ్ముళ్లు జీర్ణించుకోలేక పోతున్నారు. జైల్లో ఉన్న చంద్రబాబును పరామర్శించిన అనంతరం ఇటీవల జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చేసిన ప్రకటన ఆ పార్టీ కేడర్‌లో గందరగోళం పెంచింది. పొత్తు కారణంగా జనసేనకు టికెట్ కేటాయిస్తే తమ పరిస్థితి ఏంటనే ఆందోళన నెలకొంది. వచ్చే ఎన్నికల్లో తానే టీడీపీ అభ్యర్థిగా వస్తానంటూ ఏడాది కాలంగా మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి తన అనుచరుల ద్వారా ప్రచారం చేయిస్తున్నారు. మరోవైపు పరిటాల శ్రీరామ్ తనకే టికెట్ ఖరారయ్యిందంటూ చెప్పుకుంటున్నారు. ఇలా ఎవరికి ఎవరు టికెట్ తమదంటే తమదంటుండడంతో ఆ పార్టీ కేడర్ మొత్తం అయోమయంలో పడింది. ఒకవేళ వరదాపురం సూరికే టికెట్ వస్తే ఓడిన తర్వాత మళ్లీ పార్టీ మారి తమను వెర్రిపప్పలను చేయడం ఖాయమని బాహాటంగానే విమర్శిస్తున్నారు. శ్రీరామ్‌ను నిలబడితే రాప్తాడు నియోజకవర్గం నుంచి పరిటాల కుటుంబీకులు వచ్చి పెత్తనం చెలాయిస్తారని, అది తమకు ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని అభిప్రాయపడుతున్నారు. వీరిద్దరిని కాదని జనసేన అభ్యర్థికి టికెట్ ఇస్తే తామెందుకు పని చేస్తామని ప్రశ్నిస్తున్నారు. టీడీపీలో ఉంటే ఇంకొకరి పల్లకీ మోయడం తప్ప ఫలితం ఉండదనే డైలమాలో పడుతున్నారు. క్రమంగా పార్టీ కార్యక్రమాలకు దూరం జరుగుతున్నారు. చంద్రబాబు అరెస్టు విషయంలో నియోజకవర్గంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి కనీసం స్పందన కరువు కావడం ఇందుకు నిదర్శనం.

చూపు.. వైఎస్సార్‌సీపీ వైపు..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామి రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వరదాపురం సూరి 11 రోజులకే బీజేపీ తీర్థం పుచ్చుకుని టీడీపీ కేడర్‌కు షాక్ ఇవ్వడంతో.. అధికార పార్టీ ప్రతీకార రాయకీయాలకు దిగితే తమకు దిక్కెవరని తెలుగు తమ్ముళ్లు ఆందోళన చెందారు. అయితే ఎమ్మెల్యే కేతిరెడ్డి మాత్రం ఎక్కడా వైఎస్సార్‌సీపీ కేడర్‌ను అటు వైపు మళ్లకుండా గట్టి చర్యలు చేపట్టారు. తన దృష్టి మొత్తం నియోజకవర్గ అభివృద్ధిపైనే కేంద్రీకరించారు. నియోజకవర్గంలో 13,500కు పైగా ఇళ్లు మంజూరు చేయించారు. పట్టణంలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో పేదలకు 11 వేలకు పైగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా కృషి చేశారు. ఇప్పటికీ చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికకు సిద్ధం



వైఎస్సార్‌సీపీలో చేరుతున్న సందర్భంగా టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

ప్రజాబలం, స్థిరమైన నాయకత్వం ఉండడంతో టీడీపీ నాయకుల చూపు వైఎస్సార్‌సీపీ వైపు మళ్లుతోంది. ఇందులో భాగంగానే ఈ నెల 17న ధర్మవరం పట్టణానికి చెందిన మైనార్టీ నాయకుడు, 10వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ కృష్ణాపురం జమీర్ తన అనుచర గణంతో ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఇందుకు సంబంధించి పట్టణంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. రానున్న రోజుల్లో ముదిగుబ్బ, తాడిమర్రి, బత్తలపల్లి, ధర్మవరం మండలాల్లోనూ టీడీపీ నుంచి పెద్ద ఎత్తున చేరికలుండవచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో నియోజకవర్గంలో టీడీపీ తరఫున ఎవరు నిలబడ్డా ఓటమి మూటగట్టుకోవడం ఖాయమనే మాటలు జోరుగా వినిపిస్తున్నాయి.

దంపతుల దారుణ హత్య

- హంతకుణ్ని రాళ్లతో కొట్టి చంపిన గ్రామస్తులు

యాడికి: ఇంటి బయట నిద్రిస్తున్న భార్యాభర్తలను వేట కొడవలితో నరికి చంపడమే కాకుండా అడ్డొచ్చిన వారిపై దాడికి దిగిన మతిస్థిమితం లేని వ్యక్తిని గ్రామస్తులు మూకుమ్మడిగా రాళ్లతో కొట్టి చంపారు. ఈ ఘటన అనంతపురం జిల్లా యాడికి మండలం నిట్టూరు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామంలోని రజక కులానికి చెందిన బాలరాజు (52), సుంకులమ్మ (45) దంపతులకు సునీత, సుభద్ర, సుమలత అనే ముగ్గురు కూతుళ్లు, సుదర్శన్ అనే కుమారుడు ఉన్నారు. బాలరాజు కులవృత్తినే నమ్ముకుని ముగ్గురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసి అత్తారింటికి పంపారు. కుమారుడు సుదర్శన్ అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం సమీపంలోని ఓ పెట్రోల్ బంకులో దినసరి కూలిగా పని చేస్తున్నాడు. వారి ఇంటి ఎదురుగా ఉండే వెంకటరాముడు, సుజాత దంపతులకు కుమారుడు ప్రసాద్ (35) ఉన్నాడు. ఇతనికి పదేళ్ల క్రితమే వివాహమై.. ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. ప్రసాద్ తన తండ్రితో కలసి గ్రామ సమీపంలో కట్టెలు కొట్టి వాటితో బొగ్గు తయారు చేసి విక్రయించేవాడు. ప్రసాద్‌కు మూడేళ్లుగా మతి స్థిమితం లేదు. తరచూ భార్య మౌనికతో గొడవ పడేవాడు. బాలరాజు వారిని మందలిస్తూ మంచిగా కాపురం చేసుకోవాలని చెప్పేవాడు. పది రోజుల క్రితం మౌనికను ప్రసాద్ కొట్టడంతో పిల్లలిద్దరినీ తీసుకుని పుట్టింటికి పోయింది. శుక్రవారం భార్యను పిలుచుకు రావడానికి తాడిపత్రి వెళ్లిన ప్రసాద్ అక్కడ కూడా భార్యతో గొడవ పడి సాయంత్రం ఇంటికి తిరిగొచ్చాడు. భార్య కాపురానికి రాలేదని మనస్తాపం చెందిన అతను శనివారం తెల్లవారు జామున మూడు గంటల సమయంలో వేటకొడవలి తీసుకుని ఇంటి ఎదుట మంచంపై గాఢ నిద్రలో ఉన్న బాలరాజు, సుంకులమ్మ దంపతులను విచక్షణారహితంగా నరికాడు. ఆ శబ్దానికి పక్కనే అరుగుపై నిద్రిస్తున్న బాలరాజు కుమారుడు సుదర్శన్ నిద్రలేచాడు. రక్తపు మడుగులో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న తల్లిదండ్రులను చూసి గట్టిగా కేకలు వేశాడు. దీంతో చుట్టుపక్కల వారందరూ నిద్రలేచి రాగా వారిపైనా ప్రసాద్ కొడవలితో దాడికి యత్నించాడు. దీంతో కోపోద్రిక్తులైన బాలరాజు బంధువులు మూకుమ్మడిగా రాళ్లతో దాడి చేశారు. అతను అక్కడికక్కడే మృతి చెందాడు.

పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు

- 'వైఎస్సార్ కాపు నేస్తం' నిధుల విడుదల కార్యక్రమంలో వక్తలు
- జిల్లాలో 6,961 మందికి రూ.10.441 కోట్ల లబ్ధి



లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పుట్టపర్తి అర్బన్: కులమతాలు, పార్టీలకతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 'వైఎస్సార్ కాపు నేస్తం' పథకం నిధుల విడుదల సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసే కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణా రెడ్డి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీ నరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా చేసుకుని రాష్ట్రాన్ని పాలిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దుష్టశక్తుల నుంచి అందరినీ కాపు కాస్తున్నారని కొనియాడారు. చంద్రబాబు ప్రభుత్వం ఇలాంటి సంక్షేమ పథకాలు అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. ఎటువంటి పథకాలు లేకుండానే రాష్ట్ర ఖజానాను కరిగించేశారని విమర్శించారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలా జ్యోతి మాట్లాడుతూ జిల్లాలో 6,961 మందికి రూ.10.441 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఇప్పటివరకూ ఒక్కో మహిళకు రూ.60 వేల చొప్పున అందిందని వెల్లడించారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు. సొంత అన్న ఉన్నా ఇంతగా చేయూత అందించరని కొనియాడారు. అనంతరం మెగా చెక్కును లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో గోరంట్ల ఎంపీపీ ప్రమీలమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న, బీసీ కార్పొరేషన్ ఏఈఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలలో కూడా ఊహించలేదు



ఒక్కో విడత రూ.15 వేలు అందజేస్తారని కలలో కూడా ఊహించలేదు. సీఎం వైఎస్ జగన్ నాలుగేళ్లుగా ఆర్థిక సాయం చేస్తూ నా కుటుంబాన్ని నడిపిస్తున్నారు. డ్వాక్రా రుణ మాఫీ, సున్నా వడ్డీ, రైతు భరోసా వంటి పథకాలతో ఆదుకుంటున్నారు. ఏమిచ్చి రుణం తీర్చుకోగలం.
– అరుణ, ఎనుములపల్లి

చాలా సంతోషంగా ఉంది



ఇప్పటి వరకూ రూ.60 వేలు అందుకున్నా. చాలా సంతోషంగా ఉంది. ఇంత కన్నా మహిళలకు ఇంకేం కావాలి. మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిందే.
– తిప్పమ్మ, బ్రాహ్మణపల్లి

గత ప్రభుత్వాలు ఆదుకోలేదు



ఎలాంటి కష్టం రాకుండా చూసుకుంటానని ఎన్నికల్లో ఒక్క సారి చెప్పారు. నాలుగేళ్లుగా ఆదుకుంటున్నారు. ఆయన చెప్పాడంటే చేస్తాడంతే. రూపాయి లంచం లేకుండా సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న నాకు రెండేళ్లుగా రూ.15 వేల చొప్పున అందజేస్తున్నారు. ఇంతలా గతంలో ఎవరూ ఆదుకోలేదు.
– సుశీల, పుట్టపర్తి

బీటెక్‌లో ఆనర్స్ విధానం

- 6వ బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశంలో నిర్ణయం
- జేఎన్‌టీయూఏ వీసీ జింకా రంగజనార్దన



బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలో బీటెక్ కోర్సుల్లో ఆనర్స్ విధానం తీసుకురానున్నట్లు వీసీ ప్రొఫెసర్ జింకా రంగ జనార్దన అన్నారు. యూనివర్సిటీలోని ప్రిన్సిపాల్ కార్యాలయంలో శనివారం వీసీ అధ్యక్షతన జరిగిన ఆరవ బీటెక్ ప్రోగ్రాం బోర్డ్ ఆఫ్ స్టడీస్ కామన్ బోర్డు సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. బీటెక్ కోర్సు విద్యాప్రణాళిక పునః పరిశీలనలో భాగంగా మార్పుచేర్పులు ఉంటాయని పేర్కొన్నారు. రెగ్యులర్ కోర్సుతో పాటు ఆనర్స్ డిగ్రీని ప్రవేశపెడుతున్నామన్నారు. ఆనర్స్ డిగ్రీ పొందాలంటే 15 క్రెడిట్‌లను అదనంగా సాధించాల్సి ఉంటుందన్నారు. 5 ప్రొఫెషనల్ ఎలక్టివ్స్, 4 ఓపెన్ ఎలక్టివ్స్, 5 ఓరియంటెడ్ కోర్సులను ప్రవేశపెడుతున్నామన్నారు. క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ పాలసీని ప్రవేశపెడుతున్నామన్నారు. రెండు సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లను రెండో సంవత్సరం, మూడో సంవత్సరం చివరలో నిర్వహించాల్సి ఉంటుందన్నారు. వీటికి 8 వారాల వ్యవధిని ఇస్తామన్నారు. నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్‌లో ప్రాజెక్ట్ లేదా ఇంటర్న్‌షిప్ సెమిస్టర్ మొత్తం ప్రవేశపెడుతున్నామన్నారు. వీటితో పాటు ఆడిట్ కోర్సులను పూర్తి చేయాలన్నారు. రెగ్యులర్ డిగ్రీలో మూడో సెమిస్టర్ వరకు 7 సీజీపీఏ సాధించిన విద్యార్థులు మాత్రమే డిగ్రీ రిజిస్టర్ చేసుకోవడానికి అనుమతి ఇస్తామన్నారు. డిగ్రీలో మల్టీ ఎగ్జిట్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మొదటి సంవత్సరం సిలబస్‌కు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, ప్రిన్సిపాల్ ఎస్‌వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణ కాంతి, ప్రొఫెసర్ దుర్గాప్రసాద్, కృష్ణా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ కేబీ చంద్రశేఖర్, పాలకమండలి సభ్యులు డాక్టర్ రామశేఖర్‌రెడ్డి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అనంతపురం: ప్రజా ప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం అనంతపురం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్‌లో నగరపాలక సంస్థ వార్డు అడ్మిన్ కార్యదర్శులకు ప్రజా ప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సహజ న్యాయ సూత్రాల ఆధారంగానే శాశ్వత లోక్ అదాలత్‌లో వివాద పరిష్కారం జరుగుతుందన్నారు. మధ్యవర్తిత్వ కేంద్ర సభ్యులు, న్యాయవాది హరికృష్ణ మాట్లాడుతూ కోర్టులలో దాఖలు చేయని వివాదాలు మాత్రమే శాశ్వత లోక్ అదాలత్‌లో దాఖలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు రాజశేఖరరెడ్డి, ఎంఎల్ఎన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా ప్రయోనాల శాశ్వత లోక్ అదాలత్‌లో ఫిర్యాదు దాఖలు చేయడానికి ఎటువంటి కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

టీడీపీ నేత రవికుమార్ అరెస్ట్

బుక్కరాయసముద్రం: దివ్యాంగురాలి భూమిని లాక్కుని, ఆమె ఆత్మహత్యకు కారకులైన కేసులో నిందితుడైన ఆమె మేనమామ, టీడీపీ నాయకుడు బండారు రవికుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు శనివారం బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్‌లో సీఐ నాగార్జునరెడ్డి మీడియాకు వెల్లడించారు. సిద్దరాంపురంలో తన భూమిని టీడీపీ శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రావణి తండ్రి అయిన ఆ పార్టీ నేత బండారు రవికుమార్ కాజేశాడని దివ్యాంగురాలైన నాగరాణి అలియాస్ రాజమ్మ (44) సెల్ఫీ వీడియోలో వివరించి ఆత్మహత్య చేసుకుందని ఆయన తెలిపారు.

నల్లి పురుగు నివారణ చర్యలు చేపట్టండి

పుట్టపర్తి అర్బన్: వరి పంటలో నల్లి పురుగు ఆశించిందని, మొదటి దశలోనే నివారణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు ఉంటాయని రైతులకు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రామసుబ్బయ్య సూచించారు. నిడిమామిడి, కొట్లపల్లి, మార్లపల్లి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి వరి పంటకు నల్లిపురుగు ఆశించినట్లు గుర్తించి నివారణ చర్యలు వివరించారు. లీటరు నీటికి వెట్టబుల్ సల్ఫర్ 3 గ్రాములు లేదా డైకోఫాల్ 5 మిల్లీ లీటర్లు లేదా ఒమైట్ 1 మిల్లీలీటరును కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు 50 కిలోల యూరియా వేసుకోవాలన్నారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం





విద్యార్థులతో ఎస్పీ మాధవరెడ్డి, ఆర్డీఓ భాగ్యరేఖ, శ్రీసాయి విద్యానికేతన్ కరస్పాండెంట్ వై.సాయిగీత, తదితరులు - విజేతలతో నిర్వాహకులు

- 'సాక్షి' మీడియా గ్రూపు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శిక్షణా శిబిరం
- పుట్టపర్తిలోని శ్రీసాయి విద్యానికేతన్‌లో సందడి

SAKSHI DIGITAL MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్ ANDHRA PRADESH AP Pollution Control Board

సాక్షి, పుట్టపర్తి

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే పూజించాలని జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ కేఎస్ భాగ్యరేఖ పిలుపునిచ్చారు. 'సాక్షి' మీడియా గ్రూపు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో పుట్టపర్తిలోని పెద్దబజారులో ఉన్న శ్రీసాయి విద్యానికేతన్ సాయిగీత స్కూల్‌లో శనివారం 'చిన్నారుల చేతుల్లో మట్టి గణేశుడు' శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ స్కూళ్లకు చెందిన 5 నుంచి 15 ఏళ్ల లోపు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు.

జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభం..

శ్రీసాయి విద్యానికేతన్ స్కూల్ కరస్పాండెంట్ వై.సాయిగీత, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎస్పీ మాధవరెడ్డి, ఆర్డీఓ భాగ్యరేఖ మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాల్లో ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధించాలన్నారు. మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. చిన్నారులు చేసిన మట్టి గణపతులు చూడచక్కగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమం చిన్నారుల్లోని సృజనను వెలికి తీసిందన్నారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారి ఎస్.మహేష్‌బాబు, 'సాక్షి' ప్రతినిధులు జి.కృష్ణారెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

చిన్నారుల చేతిలో మట్టి గణేశుడు కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ స్కూళ్లకు చెందిన 200 మంది విద్యార్థులు హాజరై... ఒకే వేదికపై విభిన్న ఆకృతుల్లో గణపయ్యలను సిద్ధం చేశారు. పుట్టపర్తికి చెందిన కుమ్మరి నాగభూషణం మాస్టర్ ట్రైనర్‌గా వ్యవహరిస్తూ మట్టితో గణపతుల తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. న్యాయ నిర్ణేతలుగా ఆర్డీఓ భాగ్యరేఖతో పాటు పాఠశాల కరస్పాండెంట్ వై.సాయిగీత వ్యవహరించారు. ప్రథమ స్థానాన్ని బి.ఐశ్వర్య, బి.శ్రుతి (9వ తరగతి) దక్కించుకోగా, ద్వితీయ స్థానాన్ని మధుప్రియ (7వ తరగతి), తృతీయ స్థానాన్ని లిఖిత (10వ తరగతి) కైవశం చేసుకున్నారు. అలాగే శాలిని (10వ తరగతి), పి.షర్మినా (9వ తరగతి), ఎ.మానస (శాంతినికేతన్, కొత్తచెరువు), ధీరజ్ కృష్ణ (ఎంజేపీ, లేపాక్షి), మాన్విక్‌రెడ్డి (నారాయణ స్కూల్, కొత్తచెరువు), టి.కీర్తన (7వ తరగతి), హర్షవర్ధన్ (6వ తరగతి) కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. విజేతలను అభినందిస్తూ ముఖ్య అతిథులు బహుమతులు ప్రదానం చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



భవిష్యత్తు తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. విద్యార్థి దశ నుంచే ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పించాలి. ప్లాస్టిక్ బదులు ప్రత్యామ్నాయ వనరులు వినియోగించుకునేలా ప్రోత్సహించాలి. వినాయక చవితి సందర్భంగా మట్టి ప్రతిమలనే పూజించండి. వినియోగించండి.

– ఎస్.మహేష్, కాలుష్య నియంత్రణ మండలి అనలిస్ట్

విద్యార్థి దశ నుంచి నేర్చుకోవాలి

ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థి దశలోనే చైతన్యం పొందాలి. తద్వారా భవిష్యత్తు తరాలకు కాలుష్యం లేని వాతావరణాన్ని అందించవచ్చు. కాలుష్య నియంత్రణ మండలి విధివిధానాలను ప్రతి ఒక్కరూ పాటించాలి.

– వై.సాయిగీత, శ్రీసాయి విద్యానికేతన్ కరస్పాండెంట్



మట్టి గణపతుల తయారీలో నిమగ్నమైన విద్యార్థులు





మట్టితో గణపతి బొమ్మ తయారీ విధానాన్ని వివరిస్తున్న కుమ్మరి నాగభూషణం - మట్టితో గణపతులు చేస్తున్న విద్యార్థులు

'ఆ కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టండి'

అనంతపురం సిటీ: శ్రీసత్యసాయి జిల్లాలోని శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో అక్రమంగా నిధులు కాజేసిన కాంట్రాక్టర్లు ఎల్‌కే నాయుడు, గోవర్దన్‌రెడ్డిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని సీఐటీయూ ప్రతినిధులు కోరారు. శనివారం ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను క్యాంప్ కార్యాలయంలో కలసి, వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు ఓబులు, నాగేంద్ర పాల్గొన్నారు.

కిరాతకంగా భార్య హత్య

- గౌరిబిదనూరులో దారుణం





అంజుంఖాన్, హతురాలు షనవాజ్

గౌరిబిదనూరు (కర్ణాటక): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి కిరాతకుడిగా మారాడు. భార్యను గొంతు కోసి దారుణంగా హతమార్చాడు. ఈ ఘటన కర్ణాటకలోని గౌరిబిదనూరులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. హిందూపురానికి చెందిన షనవాజ్ (30)కు ఎనిమిదేళ్ల క్రితం అంజుంఖాన్‌తో వివాహమైంది. దంపతులిద్దరూ గౌరిబిదనూరులో నివాసముంటున్నారు. వీరికి సంతానం లేదు. కుటుంబ కలహాలతో దంపతులిద్దరూ శుక్రవారం రాత్రి గొడవ పడ్డారు. అనంతరం శనివారం వేకువజామున ఎస్‌డీఎం వైనరీ సమీపంలో కత్తితో షనవాజ్ గొంతును అంజుంఖాన్ కోసి, మృతి చెందినట్లు నిర్ధారించుకున్న తర్వాత నేరుగా గౌరిబిదనూరు రూరల్ పోలీసులకు లొంగిపోయాడు. హత్య జరిగిన ప్రాంతం తమ పరిధిలోది కాకపోవడంతో వారు మంచేనహళ్లి పోలీసులకు అప్పగించారు. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించి, హతురాలి అన్న జబీవుల్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చంద్రబాబు అరెస్ట్ చట్టబద్ధమే

- వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అనంత జిల్లా అధ్యక్షుడు ఉమాపతి



మాట్లాడుతున్న గాజుల ఉమాపతి

అనంతపురం కార్పొరేషన్: కుప్పం ఎమ్మెల్యే, మాజీ సీఎం చంద్రబాబు అరెస్ట్ రాజ్యాంగ బద్ధంగానే సాగిందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి అన్నారు. చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ ఇటీవల జిల్లా న్యాయస్థానం ఎదుట టీడీపీ లీగల్ సెల్ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని ఆయన ఖండించారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా లీగల్ సెల్ ప్రతినిధులతో కలసి శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు కేసులో బెయిల్ వేసే అధికారం ఉన్నా ఆ దిశగా పిటీషన్ దాఖలు చేయకుండా న్యాయ వ్యవస్థను తప్పుదోవ పట్టించాలనుకోవడం టీడీపీ లీగల్ సెల్ నాయకులకు భావ్యం కాదన్నారు. స్కిల్ స్కాంను సీఐడీ తరఫున వాదిస్తున్న పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి కొందరు బెదిరింపు కాల్స్ చేయడంతో పాటు టీవీ 5 డిబెట్‌లో ఇష్టానుసారంగా మాట్లాడుతూ, సామాజిక మాధ్యమాల్లోనే పొన్నవోలు వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా పోస్టుంగులు పెట్టడం సరికాదన్నారు. కాపుల భవిష్యత్తు కోసం పార్టీని స్థాపించిన పవన్ కళ్యాణ్ ఈ రోజు అదే కాపుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా రాజమండ్రి సెంట్రల్ జైలులో చంద్రబాబును పరామర్శించడం సిగ్గుచేటన్నారు. కాపు ఉద్యమకారుడు, తునిలో 50 లక్షల మందిని కలిపిన ముద్రగడ్డ పద్మనాభాన్ని పోలీసులు అరెస్టు చేసి, వారి కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేసినప్పుడు ఎక్కడ దాక్కున్నాడో చెప్పాలని పవన్ కళ్యాణ్‌ను ప్రశ్నించారు. రానున్న రోజుల్లో టీడీపీ, జనసేనకు ప్రజలే సరైన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో శ్రీ సత్యసాయి జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి గొని నాగన్న, నాయకులు వెంకట్రాముడు, నాగిరెడ్డి, ఇలియాజ్ అహమ్మద్, సుబ్బేనాయక్, మహబూబ్‌ఖాన్, గోకుల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఐదుగురి అరెస్ట్

ధర్మవరం అర్బన్: హత్య కేసులో ఐదుగురు నిందితులు పట్టుబడ్డారు. వివరాలను స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. ధర్మవరంలోని గాంధీనగర్‌కు చెందిన సాకే శ్రీనివాసులు ఈ నెల 8న హత్యకు గురైన విషయం తెలిసిందే. సాకే శ్రీనివాసులు మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని మండలంలోని బడన్నపల్లి బీసీ కాలనీకి చెందిన కపాడం రామ్మోహన్, ఎ.గంగాధర్, సి.శివయ్య, గాంధీనగర్‌కు చెందిన కమతం సంగాలప్ప, చెన్నేకొత్తపల్లి మండలం వెల్దుర్తి బీసీ కాలనీకి చెందిన శ్రీనివాసులు తరచూ గొడవపడి అసభ్య పదజాలంతో దూషించేవాడు. దీంతో శ్రీనివాసులును అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్న ఐదుగురూ ఈ నెల 8వ తేదీ సాయంత్రం ఆటోలో శ్రీనివాసులును ఎక్కించుకుని బడన్నపల్లి సమీపంలోని వంక పోరంబోకు స్థలానికి చేరుకున్నారు. అందరూ అక్కడే మద్యం తాగి మత్తులో గొడవ పెట్టుకుని కట్టె, ఇనుప యాంగులర్‌తో తల పై కొట్టి హతమార్చారు. అనంతరం సాక్ష్యాలను తారుమారు చేసేందుకు మృతదేహాన్ని అక్కడి నుంచి ఆటోలో తీసుకు వచ్చి గూడ్స్‌షెడ్ కొట్టాలకు వెళ్లే రైల్వే మార్గంలో రోడ్డు పక్కన పడేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో నిందుతులను అరెస్ట్ చేసి, ఆటో, ద్విచక్ర వాహనం, హత్యకు ఉపయోగించిన యాంగులర్, కట్టె స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

అంతర్‌జిల్లా ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత

కదిరి అర్బన్: సీనియర్ జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు స్థానిక ఎస్టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత ప్రారంభించారు. జిల్లాతోపాటు వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, నంద్యాల జిల్లాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ సుగుణమ్మ, పీడీ నరసింహాచారి, జిల్లా ఫుట్‌బాల్ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు ఇర్షాద్, కరాటే కోచ్‌లు షెక్షావలి, అక్బర్ అలీఖాన్, ఖాజాపీర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్‌లో ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించండి

- ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్

పెనుకొండ: డ్రిప్ వినియోగంలో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ సూచించారు. స్థానిక ఉద్యాన శాఖ కార్యాలయంలో 32 మండలాలకు సంబంధించిన ఎంఐఏఓలు, ఎంఐలు, డ్రిప్ కంపెనీల డీసీఓలతో శనివారం ఆయన సమీక్షించారు. ఈ నెల 18తో రైతులకు డ్రిప్ పరికరాలు అందించే ప్రక్రియ ముగుస్తుందన్నారు. సిబ్బంది కలసికట్టుగా పని చేస్తూ పెండింగ్‌లో ఉన్న డ్రిప్ పరికరాల ఏర్పాటు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా డ్రిప్ ద్వారా ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. యాసిడ్ ట్రీట్‌మెంట్‌పై దృష్టి నిలిపి రైతులను చైతన్య పరచాలన్నారు.

పనితీరు మెరుగు పరుచుకోండి



రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామాంజనేయులు

లేపాక్షి: పనితీరు మెరుగు పరుచుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి ఉంటుందని ఏపీఓ, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులను డ్వామా పీడీ రామాంజనేయులు హెచ్చరించారు. మండలంలో చేపట్టిన ఉపాధి పనులపై శనివారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో ఆయన సమీక్షించారు. పలు రికార్డులు పరిశీలించారు. నివేదికల సమర్పణలో సిబ్బంది విఫలం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డుల్లో అధికారుల సంతకాలు లేకపోవడంతో వారంలోపు పనితీరు మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం ఏపీ గురుకుల పాఠశాల, చోళసముద్రంలో చేపట్టిన ఇంకుడు గుంతల పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ శివానందనాయక్, ఎంపీడీఓ నరసింహ నాయుడు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష' సర్వే పకడ్బందీగా చేపట్టాలి



పీహెచ్‌సీ వైద్యాధికారులతో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణయ్య

పరిగి: జిల్లాలో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని నోడల్ అధికారి డాక్టర్ కృష్ణయ్య ఆదేశించారు. శనివారం ఆయన పరిగి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించి, శీతలీకరణ పెట్టెల నాణ్యతపై వైద్యాధికారులతోఆరా తీశారు. అనంతరం పరిగిలో చేపట్టిన ఆరోగ్య సురక్ష సర్వే తీరును పరిశీలించారు. ఈ నెలాఖరు వరకూ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, వలంటీర్ల సహకారంతో ఇంటింటీ సర్వే పూర్తి చేయాలన్నారు. అక్టోబర్ 1 నుంచి హెల్త్ క్యాంప్‌లను చేపట్టి రోగగ్రస్తులకు మెరుగైన చికిత్సలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు స్వరూపరెడ్డి, రూబి, సీహెచ్ఓ వన్నప్ప, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.